క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు వితరణ



సాయం అందిస్తున్న సర్పంచ్ సుబ్బారావు

దెందులూరు: మండలంలోని నాగులదేవునిపాడులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా జక్కుల లలితమ్మ ఇల్లు కాలి బూడిదైంది. బాధితురాలికి గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి నిత్యావసర వస్తువులు, సరుకులు, ఆర్థిక సాయం గురువారం సాయంత్రం అందజేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు కొండపల్లి శ్రీధర్, రాజేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



కొవ్వలి బస్టాండ్ సెంటరులో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: ఓటు హక్కు వజ్రాయుధమని, అర్హులందరూ ఓటు హక్కు పొందాలని తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య కోరారు. గురువారం కొవ్వలి బస్టాండ్ సెంటరులో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఫ్లెక్సీలు చేతపట్టుకుని ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు రామకృష్ణ, కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులున్నారు.

వికసిత్ భారత సంకల్పయాత్ర



లబ్ధిదారులకు గ్యాస్‌స్టౌను అందజేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: వికసిత్ భారత సంకల్పయాత్ర ఉంగుటూరు మండలం గొల్లగూడెం, గోపాలపురం గ్రామాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీ రాణి చేతుల మీదుగా గ్యాస్ స్టౌవ్‌లను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. క్యాక్రమానికి గ్రామ సర్పంచ్ కరప శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. గొల్లగూడెం సభలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగు, వైఎస్సార్ సీపీ నాయకులు, బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ అంజనేయ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు నుంచి పెదపాడు మండలంలో యాత్ర

పెదపాడు : మండలంలోని పెదపాడు, వీరమ్మకుంట, నాయుడుగూడె గ్రామాల్లో వికసిత్ సంకల్ప యాత్ర ఈనెల 15 నుంచి 26 వరకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సూర్యకుమార్ తెలిపారు.

నేటి నుంచి ఉపాధి మేట్లకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ దశరథరామ్‌జీ

దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకం మేట్లకు శుక్రవారం నుంచి దెందులూరులో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని దెందులూరు మండల ఏపీఓ దశరథరామ్‌జీ అన్నారు. గురువారం మండల ఉపాధి కార్యాలయంలో టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రోజుకు 50 మంది చొప్పున, వారం రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఏపీఓ తెలిపారు.

విశ్వబ్రాహ్మణ కులంగా నమోదు చేయాలి



తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉంగుటూరు: పంచ ఉపకులాలుగా ఉన్న విశ్వ బ్రాహ్మణులందరినీ కలిపి విశ్వబ్రాహ్మణ కులంగా నమోదు చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం మండలఅధ్యక్షుడు అన్నపోజు వీరవెంకట బ్రహ్మం కోరారు. విశ్వబ్రాహ్మణ కుల జనగణన నిమిత్తం స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, ఈవోపీఆర్‌డీ కార్యాలయాల్లో ఈమేరకు వినతి పత్రం అందజేశారు. కమ్మరి, కంచరి, కంసాలి, వడ్రంగి, శిల్పి ఇలా పంచ ఉపకులా లుగా విశ్వబ్రాహ్మణులుగా ఉన్నారని, కుల జనగణన సమయంలో వీరందినీ విశ్వబ్రాహ్మణ కులంగా నమోదు చేయాలని కోరారు. సంఘ సభ్యులు యర్రోజు సుబ్బయ్యాచార్యులు, గురజాజు సురేష్, బి.శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వరరావు, ఎం.వీరబ్రహ్మం, ఎం.గంగాధర్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీదే



దుగ్గిరాల ప్రధాన కూడలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



జనసమూహంలో మాట్లాడుతున్న అబ్బయ్యచౌదరి

ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

పెదవేగి : గత పాలకులు పెదవేగి మండలం దుగ్గిరాలలో ఇంటి స్థలం ఇమ్మంటే, చెరువులో పోరంబోకుల్లో ఇచ్చారని, నేడు పొలం కొని ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీకే దుక్కుతుందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం ఆయన దుగ్గిరాలలో ప్రజా ఆశీర్వాద యాత్రను ప్రారంభించారు. దుగ్గిరాల, పినకడిమి, కొప్పాక మీదుగా యాత్ర సాగింది. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ తొలి విడత 100 కిలోమీటర్లు, దాదాపు 23 గ్రామాలు తిరిగి, రాత్రి గ్రామాల్లో బస చేయస్తానని, ప్రజల కష్టాలు తెలుసుకుని పరిష్కరిస్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత దళితవాడలో సీసీ రోడ్డు వేయించామని, దుగ్గిరాల నుంచి సత్రంపాడు వెళ్లే రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. సచివాలయం, నాడు – నేడు పథకంలో పాఠశాల రూపురేఖలు మార్చామని, దళితవాడ జోసెఫ్ నగర్‌లో కమ్యూనిటీహాల్, దళితవాడలో డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేసే ఓటు అడగడానికి వస్తానని ఎమ్మెల్యే అన్నారు. రాయికుంట చెరువులో వాసులు ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



పినకడిమిలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఇతర నాయకులు

జగన్ స్ఫూర్తితో యాత్ర

కార్యక్రమంలో పాల్గొన్న గోపాలపురం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు తలారి వెంకటరావు, పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మహన్‌రెడ్డి స్ఫూర్తితో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చేపట్టిన పాదయాత్రకు అనూహ్య స్పందన లభించిందన్నారు. ఆయనకు 2024 ఎన్నికల్లో సుమారు 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నేడు మాటలు చెప్పే ముఖ్యమంత్రి కాదని, చేతలతో అభివృద్ధి చేసి చూపిన ముఖ్యమంత్రి మనకు ఉన్నారని ప్రజలకు వివరించారు. పాదయాత్ర చేస్తున్న అబ్బయ్యచౌదరికి హృదయపూర్వక ఆశీస్సులు అందిస్తున్నామని చెప్పారు. ఈ ఐదేళ్లలో జగనన్న ఆశీస్సులతో దెందులూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సంక్షేమాన్ని వివరించి ప్రజల ఆశీర్వాదం పొందేందుకే ఈ యాత్ర చేపట్టినట్టు తెలిపారు.

పోషకాహారం అందించడమే లక్ష్యం



పెదవేగిలో ప్రాథమిక పాఠశాలలో భోజనం చేస్తున్న చిన్నారులు

పెదవేగి : అంగన్‌వాడీల సమ్మెతో చిన్నారులు ఇబ్బందులు పడకూడదనే ఆలోచనతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ ఎ.పద్మావతి అన్నారు. పెదవేగి మండలం వంగూరు, కవ్వగుంట, పెదవేగి గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలోని పాఠశాలల్లో చిన్నారులకు భోజనం ఏర్పాట్లు చేయిస్తున్నట్టు పద్మావతి తెలిపారు. సమ్మె కాలంలోనూ ఏ ఒక్క చిన్నారీ పోషకాహారం లేకుండా ఇబ్బంది పడకూడదన్నదే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. పీడీ వెంట అదనపు సీడీపీఓ ఎంఎస్ రాజశేఖర్, ఈఓ మల్లిక, పెదవేగి మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె గురువార మూడో రోజు కొనసాగింది. పెదవేగి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ మండల కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా నాయకులు పి.హైమావతి, వ్యవసాయ కార్మిక రంగ జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడారు. నాయకులు వి.బేబీరాణి, టి.కృష్ణవేణి, ఎం త్రివేణి, ఎ.భార్గవి, పీవీఎల్ సూర్యకుమారి, ఎస్ లావణ్య, కె.నిర్మల, యశోద, జి.దుర్గా, కె.శ్రావణి, పి.నాగమణి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఉంగుటూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వాసుబాబు సహకారంతో మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం ఉంగుటూరు సచివాలయం-1 పరిధిలో పల్లెకి పోదాం కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగారావు మాట్లాడుతూ ఉంగుటూరు సచివాలయం -1 పరిధిలో సుమారు రూ.29.50 లక్షలతో సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సంక్షేమం, అభివృద్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డు ప్రారంభించారు. సంక్షేమ పథకాలను గ్రామసభలో వివరించారు. దివంగత నేత రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం నాయకులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పాలనకు మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. ప్రజాభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మరడ రమావతి, మండల సచివాలయాల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, ఎంపీటీసీ సందక రాంబాబు, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు పుప్పాల గోపి, చేబ్రోలు సొసైటీ అధ్యక్షుడు ఎలిసెట్టి పాపారావు బాబ్జీ, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మంద జయలక్ష్మి, గ్రామ అధ్యక్షుడు రంగు వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి భావన సూరిబాబు, దోస్నపూడి లక్ష్మీనారాయణ, కొల్లి నాగేశ్వరరావు, ఈవోపీఆర్డి శంషుద్దీన్, సెక్రటరీ గిరిధర్, రాయపాటి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పెనుగొండ సూర్యచంద్రరావు, మండా రాజారావు, వడతల దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



ఉంగుటూరులో సంక్షేమ ఫ్లెక్సీని ప్రారంభిస్తున్న మంగారావు, నాయకులు



ఉంగుటూరు దళితవాడలో పథకాలను వివరిస్తున్న నాయకులు

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

భీమడోలు: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. స్థానిక గీతాంజలి డిగ్రీ కళాశాలలో గురువారం ఓటు నమోదు, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలపై యువతీ యువకులకు అవగాహన కల్పించారు. ఓటు నమోదు, వినియోగం తదితర అంశాలపై వివరించారు. కళాశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అర్హులంతా విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటు హక్కు మన హక్కు అంటూ నినదించారు. తొలుత కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఆర్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇందిరాగాంధీ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని, ఒక బలమైన నాయకున్ని ఎన్నుకునేందుకు ఓటు వజ్రాయుధంగా మారుతుందని అన్నారు. జనవరి నెలలో రెండో విడత ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ పద్మావతిదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో క్రీడాకారులు భాగస్వాములు కావాలన్నారు. యువతీ యువకుల్లో క్రీడా స్ఫూర్తిని నింపి వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమాలు దోహద పడతాయని తెలిపారు. క్రీడాకారులంతా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్, వీఆర్వో డి.సింహాచలం, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



పోలసానిపల్లిలో ర్యాలీలో నిర్వహిస్తున్న దృశ్యం

ఈవీఎం పనితీరుపై అవగాహన

ఉంగుటూరు: ఈవీఎంల పనితీరు పరిశీలించే కార్యక్రమం నారాయణపురం-1, -2 సచివాలయాల పరిధిలో నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ పోతురాజు ప్రజలకు ఓటు యంత్రం పనితీరును వివరించారు. తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీటీసీ చాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు, సచివాలయ కార్యదర్శి సూరతుల దుర్గాధర్ రావు, ఆర్‌బీకే చైర్మన్ శ్రీధర్ వినోద్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ఏలూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో ఆశించిన దిగుబడి సాధించవచ్చని ఏలూరు మండల వ్యవసాయ అధికారిణి జీవన సంధ్య అన్నారు. గురువారం వెంకటాపురంలో ప్రకృతి వ్యవసాయం క్షేత్రాన్ని ఆమె పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు స్వయంగా అవగాహన కల్పించేందుకు ప్రకృతి వ్యవసాయశాఖ మండల యూనిట్ ఇన్‌చార్జి కొండిశెట్టి వెంకటలక్ష్మి తన ఎకరం పొలంలో ప్రకృతి సాగు చేపట్టిందని తెలిపారు. కంపాక్ట బ్లాక్ వన్ ఇన్‌టూ వన్ పద్ధతిలో (ఎటుచూసినా అడుగుదూరంలో) 1318 వరి రకం నాట్లు వేసిందన్నారు. ఈ విధానం వల్ల దిగుబడి పెరగడంతో పాటు తెగుళ్ల సోకే అవకాశం తగ్గిందన్నారు. ఈ ప్రయోగం వల్ల ఎకరానికి 41 బస్తాలు దిగుబడి వస్తుందని చెప్పారు. ఈ సాగు విధానం ప్రత్యక్షంగా చేసి చూపడం వల్ల మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారని వివరించారు. రైతులను ప్రకృతి సాగు వైపు మళ్లించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.



పంట దిగుబడిని పరిశీలిస్తున్న ఎంఏఓ జీవనసంధ్య

అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లల్ని పంపించండి

భీమడోలు: అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తున్నాయని, తమ పిల్లలను విధిగా పంపాలని స్థానిక ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి తల్లులను కోరారు. భీమడోలు-1 ప్రాథమిక పాఠశాలకు అనుబంధంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది సమ్మె చేస్తుండడంతో మూసి ఉంది. అయితే కొందరు అంగన్‌వాడీ చిన్నారులకు పాఠశాలలో ఉంచి వారికి విద్యాబుద్ధులు నేర్పించి వారికి పోషకాహారం అందించారు. గురువారం ఎంపీడీఓ పాఠశాలను ఆకస్మిక సందర్శించారు. సచివాలయ ఉద్యోగులకు ఈ కేంద్రాల నిర్వహణపై పలు సూచనలిచ్చారు. ఈనెల 15 నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు పని చేస్తాయన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు, సచివాలయ సిబ్బంది కేంద్రాలను నిర్వహించి చిన్నారులకు పోషకాహారం అందిస్తారని చెప్పారు. ఆ కేంద్రాలను ఏపీఎం పర్యవేక్షిస్తారని తెలిపారు. భీమడోలు మండలంలోని 64 అంగన్‌వాడీ కేంద్రాలన్నీ పని చేస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రఘు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.



భీమడోలులో సిబ్బందికి సూచనలందిస్తున్న ఎంపీడీఓ పద్మావతిదేవి

అంగన్‌వాడీలను ఆదుకోవాలి

భీమడోలు: అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను తీర్చి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. భీమడోలులోని జాతీయ రహదారి పక్కనే ఉన్న సాయిబాబా ఆలయం వద్ద సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్ల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె బుధవారం మూడో రోజు కొనసాగింది. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్



గుడిపాడులో సీజ్ చేసిన కోళ్ల వ్యర్థాల వాహనం

పెదపాడు : కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్ చేసినట్టు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గురువారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆరు టన్నుల కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్‌ను పెదపాడు మండలం గుడిపాడు ఆర్‌సీఎం చర్చి వద్ద గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ పరిధిలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఏలూరు వన్‌టౌన్ స్టేషన్ పరిధిలోని బావిశెట్టివారిపేటలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి దొంగలు చోరీ చేశారు. హుండీ పగలగొట్టి అందులోని నగదు, కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో ఉంచిన నగదును అపహరించుకుపోయారు. ఆలయ అర్చకుడు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ ఎస్ రాజశేఖర్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ పోలీసులు సుబ్రహ్మణ్యేశ్వరి స్వామి ఆలయంలో వేలిముద్రలను సేకరించారు. చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకునేందుకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

భీమడోలు: ఉపాధ్యాయులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఫిజియోథెరపిస్ట్ సంతోష్ అన్నారు. భీమడోలు ఎంఆర్సీలో గురువారం మండలంలోని ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఫిజియోథెరపీ శిక్షణ హెచ్ఎం పాశం పాండురంగారావు అధ్యక్షత ఏర్పాటుచేశారు. ఫిజియోథెరపిస్ట్ సంతోష్ టీచర్లు ప్రతి రోజు చేయాల్సిన వ్యాయమాలపై అవగాహన కల్పించారు. టీచర్లు శారీరక, మానసిక రుగ్మతలను ఎదుర్కొంటున్నారని, సాంకేతికతను అందిపుచ్చుకున్న ప్రతి ఒక్కరూ అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. నేడు సెల్‌ఫోన్ల వల్ల ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, సరైన వ్యాయామాలు చేయకపోవడంతో అనారోగ్య సమస్యలతో అవస్థలు పడుతున్నారని హెచ్చరించారు. సెల్‌ఫోన్‌ను మనమంతా పక్కనే పెట్టుకుంటున్నామని, తద్వారా బ్రెయిన్ స్ట్రోక్స్ ఎక్కువగా వస్తున్నాయని, అనేక శారీరక, మానసిక సమస్యలుకు హేతువుగా ఉన్నాయని వివరించారు. సెల్‌ఫోన్‌కు ఉపాధ్యాయులు దూరంగా ఉండాలని సూచించారు. నిత్యం మెడ, నడుమ నొప్పి సమస్యలపై ఉపశమనం పొందేందుకు చేయాల్సిన వ్యాయామాలను చేసి చూపించారు. పాఠశాలల్లోని చిన్నారులకు ఉపాధ్యాయులు విద్యాబోధనతో పాటు వ్యాయామాలు నేర్పిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని వివరించారు. ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.



భీమడోలు ఎంఆర్సీలో టీచర్లకు శిక్షణ ఇస్తున్న ఫిజియోథెరపిస్ట్ సంతోష్

ఉపాధ్యాయులకు పిజియోథెరపీ ట్రైనింగ్

ఉంగుటూరు: మండలంలోని ఉపాధ్యాయులకు పిజియోథెరపీ ట్రైనింగ్ గురువారం నిర్వహించారు. ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారి-1 నిమ్మగడ్డ రవీంద్ర భారతి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుల సమక్షంలో ఈ శిక్షణ ఇచ్చారు. రవీంద్ర భారతి మాట్లాడుతూ ఈ శిక్షణలో విషయాలు ఉపాధ్యాయులు అనారోగ్య సమస్యల పరిష్కారానికి ఉపయోగపడతాయన్నారు. ఎంఈఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు నిజామ్ ఇన్సిట్యూట్ హైదరాబాద్ పిజియోథెరపీ డాక్టర్లు సురేష్, ప్రసాద్ పిజియోథెరపీ ట్రైనింగ్ ఇచ్చారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టవర్ ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: మండంలోని దోసపాడు గ్రామంలో పరిశుద్ధ నిత్యసహాయమాత టవర్ ఉత్సవాలు గురువారం పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పి.డేవిడ్‌రాజు ప్రారంభించారు. తొలుత టవర్ వద్ద జెండా ప్రతిష్ఠ కార్యక్రమం ఆయన నిర్వహించారు. అనంతరం దోసపాడు ఆర్‌సీఎం చర్చిలో దివ్యపూజాబలి అర్పించారు. టవర్ ఉత్సవాల విశిష్టతను వివరించారు. 15, 16 తేదీల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఫాదర్ తెలిపారు.

నేడు వరుడు కానున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీ వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం షష్ఠి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 15 నుంచి 21 వరకు స్వామివారి దివ్య కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఉదయం అర్చకులు, పండితులు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేయనున్నారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆలయ ఈఓ వేంద్ర త్రినాధరావు కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన మద్దుల శ్రీనివాస్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

త్రీటౌన్ సీఐగా వెంకటేశ్వరరావు

ఏలూరు టౌన్: త్రీటౌన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పనిచేస్తామని ఏలూరు త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్రీటౌన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నేరాల అదుపునకు పటిష్టమైన చర్యలు చేపడతామని చెప్పారు.

క్యాలెండర్ విడుదల

ఏలూరు (టూటౌన్) : దివ్యాంగుల కోసం పనిచేస్తోన్న అఖిల భారత సంస్థ సక్షమ్ 2024 క్యాలెండర్‌ను తపన ఫౌండేషన్ చైర్మన్ జీఎస్ఆర్ చౌదరి గురువారం విడుదల చేశారు. స్థానిక తపన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణ మోహన్, పి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.